



అదనంగా.. వెయ్యి ఎక్కడ?

- మంత్రి సీదిరి హామీ ఉత్తిదే
- నష్టాల బాటలో జీడి రైతులు
- గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ పాలనలో జీడి రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. రెండేళ్ల కిందట ఇదే సీజనులో జీడి పిక్కల బస్తా (80 కిలోలు) రూ.12వేల నుంచి రూ.14వేల వరకూ ధర పలికింది. గతేడాది రూ.8 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.7వేలకు పడిపోయింది. ఇలా ఏటా ధర తగ్గుతుండడంతో తమకు కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని జీడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. గతేడాది గిట్టుబాటు ధరపై జీడి రైతులు ఆందోళన చేయగా.. ప్రభుత్వం నుంచి బస్తాకు రూ.వెయ్యి అదనంగా ఇప్పిస్తామని మంత్రి సీదిరి అప్పలరాజు హామీ ఇచ్చారు. కానీ అదనంగా రూ.వెయ్యి ఇవ్వకపోగా, గతేడాది పలికిన ధర కూడా ప్రస్తుతం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(పలాస/పలాస రూరల్)



ఉద్దానంలో జీడిరైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జీడిపిక్కలకు ఆశించిన స్థాయిలో ధర లేక నష్టాల ఊబిలో మునిగిపోయారు. గిట్టుబాటు ధర కోసం ఉద్యమబాట పట్టినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. బస్తాకు అదనంగా రూ.వెయ్యి ఇస్తామన్న మంత్రి సీదిరి అప్పలరాజు హామీ నెరవేరకపోగా.. ధరలు మరింత తగ్గుముఖం పట్టాయని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 80వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారు. ఉద్దానం ప్రాంతంగా గుర్తింపు పొందిన పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో రైతులు ఎక్కువగా జీడి పండిస్తున్నారు. సుమారు 30వేల మందికిపైగా రైతులు, రైతు కూలీలు జీడిపంటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎకరా జీడి పంటకు 4 నుంచి 6 బస్తాల జీడి పిక్కలు పండుతాయి. సరాసరి ఎకరాకు రూ.18వేలకుపైగా ఏటా పెట్టుబడి అవసరం. ప్రస్తుతం ప్రతికూల వాతావరణం ఉండడంతో ఎకరాకు 2 బస్తాలు మాత్రమే పండుతున్నాయి. మార్కెట్‌లో బస్తా జీడిపిక్కలు(80 కిలోలు) రూ.12వేల నుంచి రూ.14వేల వరకూ గతంలో ఉండగా.. ప్రస్తుతం రూ.7వేలకు పడిపోయింది. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో జీడిపప్పు రూ.700 ఉంది. ఈ మేరకు జీడి పిక్కల ధరలు కూడా రైతులు నిర్ణయించిన ప్రకారం ఉండాలి. కానీ ఆ విధంగా ఈ ప్రాంతంలో జరగడం లేదని రైతులు వాపోతున్నారు. ధరల తగ్గుముఖానికి అసలు కారణం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలని పేర్కొంటున్నారు.

రాజ్యమేలుతున్న విదేశీ జీడిపిక్కలు..

పలాస జీడి పరిశ్రమలకు విదేశీ జీడిపిక్కల బస్తా రూ.6వేలకు లభ్యమవుతోంది. దీంతో స్వదేశీ జీడి పిక్కల కొనుగోలుకు వ్యాపారులు ఇష్టపడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు ఇటీవల జీడిపప్పు కూడా అక్రమ మార్గంలో పలాసకు చేరుకుంటోంది. ఈ క్రమంలో స్థానికంగా తయారవుతున్న జీడిపప్పు మార్కెట్ ఒక్కసారిగా పతనమైందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మన దేశంలో పండే జీడిపిక్కలు ఇక్కడున్న జీడి పరిశ్రమలకు కేవలం వంద రోజుల వరకే వస్తుంది. దీంతో విదేశీ పిక్కలు తీసుకురావడం అనివార్యమైంది. ఇదే అదనుగా ఇక్కడ పండించే జీడి పిక్కల అవసరం అంతంత మాత్రమైంది. అయితే విదేశీ జీడి పిక్కల కన్నా మన పిక్కలు నాణ్యతగా, రుచిగా ఉంటాయి. విదేశీ పప్పు పరిమాణంలో పెద్దదిగాను, చౌకగా లభిస్తుండడంతో వాటినే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇక్కడున్న పది మంది బ్రోకర్లు వేల టన్నుల పిక్కలు తీసుకువస్తూ పలాస మార్కెట్‌ను శాసిస్తున్నారు. ధరలు సైతం వారే నిర్ధారిస్తుండడంతో.. మన జీడిపప్పునకు మార్కెట్ తగ్గి.. గిట్టుబాటు లేకుండా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. విదేశీ పిక్కలను ఏడాది పాటు బ్యాన్ చేస్తే మన పిక్కలకు ఎందుకు ధర రాదని ప్రశ్నిస్తున్నారు. 'బస్తాకు కనీసం రూ.16వేలు గిట్టుబాటు ధర కల్పించాలి. రైతులు పండించే జీడిపిక్కలను నేరుగా ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలి. జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. మేలు రకమైన జీడి వంగడాలు అందించాలి' అని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీడి పండించే కన్నా.. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడయే నయమని భావిస్తున్నారు.

అదిగో.. ఇదిగో.. జీడి పరిశోధన కేంద్రం

ఉద్దానంలో జీడిపంట పరిశోధన కేంద్రం ఏర్పాటుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. వైసీపీ నేతలు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి ప్రాంతాల్లో జీడిమామిడిని ప్రధాన వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. కాగా.. సాగులో సాంకేతిక నైపుణ్యత, లోపాలను తెలిపే శాస్త్రవేత్తలు లేక.. మరోవైపు తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. బాపట్ల నుంచి శాస్త్రవేత్తలు ఇక్కడకు వచ్చి.. రైతులకు సూచనలిచ్చి వెళ్తుంటారు. కాగా.. స్థానికంగానే పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేసి.. శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు ఇస్తే అధిక దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉద్దానంలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని పేర్కొనడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో 2013లో అప్పటి సీఎం ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి పలాసలోని రామకృష్ణాపురం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఆ సమయంలో ఈ ప్రాంత రైతులు.. జీడిసాగులో ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు త్వరలోనే జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తామని కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పినా.. ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ కాలయాపన చేసింది తప్ప.. పరిశోధన కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టలేదని రైతులు వాపోతున్నారు.

ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి



ప్రతీ ఏడాది జీడిపంటపై పెట్టుబడులు, ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. కానీ దానికి తగ్గ మద్దతు ధర రావడం లేదు. ఇప్పటికైనా మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి

-కోనారి గణపతి, జీడిరైతు

ఆశలు వదులుకుంటున్నారు



జీడి పంటపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. ఏటా మందుల పిచికారీకి, తోటల పెండి కట్టేందుకు, ఆకులు కుప్పలు, పిక్కలు ఏరుకునేందుకు ఎంతో ఖర్చవుతోంది. ఇప్పటికైనా రైతులకు ఆదుకునేలా ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి.

-మామిడి భాస్కరరావు, జీడి రైతు


ఫలితం లేదు



ఉద్దాన ప్రాంతంలో జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఇతర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు వచ్చి జీడి పంట సమస్యలపై సలహాలు ఇస్తున్నా అది సరైన ఫలితాలు ఇవ్వడం లేదు.

-కుత్తుమ లక్ష్మణకుమార్, జీడి రైతు

చర్యలు చేపట్టాలి



ప్రభుత్వం రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి. దీంతో ఈ ప్రాంత రైతాంగానికి ఉపయోగకరంగా ఉంటుంది.

-ఎం.రామారావు, జీడి రైతు

పెరుగుతున్న ఖర్చులతో సతమతం

జీడి పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఓ వైపు ఖర్చులు పెరగ్గా.. మరోవైపు గిట్టుబాటు ధర లేక సతమతమవుతున్నారు. జీడి పిక్కలు కనపడాలంటే.. కింద పడిన జీడిఆకులను ఏరి ఒకచోట చేర్చి మట్టికప్పాలి. ఇందు కోసం రోజుకు ఒక మగ కూలీకి రూ.600, ఆడ కూలీకి రూ.450 చెల్లించాలి. ఎకరా తోటకు రెండు, మూడురోజుల పని ఉంటుంది. అలాగే జీడిపంట రక్షణకు కంచె వేసేందుకు మగ కూలీలకు రూ.700 చొప్పున చెల్లిస్తున్నారు. పిచికారీ చేస్తే రోజుకు రూ.500 కూలీ ఇస్తున్నారు. మిషన్ ద్వారా పిచికారీకి ఖర్చుతో పాటు మందులు ఎకరాకు రూ.1,200కిపైగా అవుతోంది. ఇంత ఖర్చు చేస్తున్నా.. దిగుబడి తగ్గడం లేక, ధర కూడా ఏటా పతనం కావడంతో అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. గిట్టుబాటు ధరపై ప్రజాప్రతినిధుల హామీలు నెరవేర్చాలని కోరుతున్నారు.

7న జిల్లాకు లోకేశ్ రాక



- శ్రీకాకుళంలో యువగళం సభకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి నారా లోకేశ్ ఈ నెల 7న శ్రీకాకుళం రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీకాకుళంలో యువగళం సభ నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు సభ జరగనుంది. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎచ్చెర్లలో 4 గంటలు కరెంట్ కట్

ఎచ్చెర్ల, మే 2: ఎచ్చెర్ల పరిసర ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయంతో వినియోగదారులు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అసలే వేసవి కాలం కావడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ముందస్తు సమాచారం లేకుండానే విద్యుత్ సరఫరా నిలిపేశారని వినియోగదారులు వాపోతున్నారు. రాత్రి 7.30 గంటలకు అధికారులు సరఫరా పునరుద్ధరించారు. దీనిపై ఏఈ హరికృష్ణ వద్ద ప్రస్తావించగా.. ఎచ్చెర్లలోని సబ్‌స్టేషన్ వద్ద సాంకేతికలోపంతో ట్రిప్ అవుతుండడంతో సరఫరాలో ఇబ్బంది ఏర్పడిందన్నారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను కూడా తొలగించామని తెలిపారు.

రైలులో గంజాయి రవాణా

- ఎవరికీ అనుమానం రాకుండా ఏసీ కోచ్‌లో ప్రయాణం
- రైల్వే పోలీసుల అదుపులో కేరళ ముఠా

పలాస, మే 2: దర్జాగా సూటుబూటు వేసుకుని.. ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తూ.. గంజాయి అక్రమ రవాణా చేసే ముఠా రైల్వే పోలీసులకు పట్టుబడింది. కేరళకు చెందిన ఈ ముఠా నుంచి రూ.50లక్షల విలువైన 102 కిలోల గంజాయి నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలాస రైల్వే సీఐ కె.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేరళ రాష్ట్రం తిరునంగడి గ్రామానికి చెందిన సలీమ్ గంజాయి అక్రమ రవాణాదారులకు బాస్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈయన ఒడిశాలో కిలో గంజాయి రూ.10వేలకు కొనుగోలు చేస్తాడు. మలప్పురం గ్రామానికి చెందిన ఫిరోజ్, ముస్తాఫా, కేటీ అబ్బాస్, పాలక్కడ గ్రామానికి చెందిన ఎంపీ ముస్తాఫాతో రవాణా చేస్తు బ్యాగుకు రూ.15వేలు చొప్పున డబ్బులు చెల్లిస్తాడు. ఒడిశా నుంచి కేరళ రాష్ట్రంలో ప్రధాన విక్రయదారులకు గంజాయి తరలించిన వరకూ వారిదే బాధ్యత. ఎవరికీ అనుమానం రాకుండా.. గంజాయిని ఖరీదైన బ్యాగులు, సూట్‌కేస్‌ల్లో నింపి.. సూటుబూట్లు వేసుకొని అఫీషియల్‌గా ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తూ గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కూడా ఇదే మాదిరి అక్రమ రవాణాకు యత్నించగా.. పోలీసులకు సమాచారం అందడంతో నిఘా పెంచారు. గురువారం మధ్యాహ్నం రైల్వే సీఐ కె.వెంకటరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ షరీఫ్, హెచ్‌సీ కోదండరావు, సోమేశ్వరరావు, పీసీలు సంతోష్‌కుమార్, దేవేందర్, రమేష్, లోకనాథం, తేజ ప్లాట్‌ఫారం-2లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఐదుగురు ముఠా సభ్యులు సూటుబూటు వేసుకుని బ్యాగులతో వారికి తారసపడ్డారు. వారు పలాసలో గుణుపూర్ రైలు దిగి.. కేరళ వెళ్లడానికి ఏసీ కోచ్ బుక్ చేసుకున్నారు. పోలీసులు వారిని ఎక్కడ నుంచి వస్తున్నారని ప్రశ్నించడంతో మొదట దమాయించారు. అనంతరం వారి బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి గుట్టు బయట పడింది. నాలుగు బ్యాగుల్లో రూ.50లక్షల విలువైన 102 కిలోల(52ప్యాకెట్లు) గంజాయి పట్టుబడింది. పోలీసులు వారిని అరెస్టు చేసి.. గంజాయి నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విశాఖపట్నం రైల్వే కోర్టులో నిందితులను హాజరుపరిచి సెంట్రల్ జైలుకు తరలిస్తామని సీఐ వెంకటరావు తెలిపారు.



రైల్వే పోలీసులకు పట్టుబడిన గంజాయి ముఠా



మెళియాపుట్టి: క్యాష్ పాయింట్ వద్ద వృద్ధుల నిరీక్షణ




జలుమూరు : చల్లవానిపేట ఎస్‌బీఐలో పింఛన్‌దారుల రద్దీ

మాపై ఎందుకీ కక్ష?

- గతనెల మాదిరే ఎందుకు ఇవ్వరు?
- బ్యాంకులో జమ చేయడం ఏంటి?
- ఎండలని కూడా గుర్తుకు రాలేదా?
- ప్రభుత్వంపై పింఛన్‌దారుల ఆగ్రహం
- బ్యాంకుల వద్ద గంటల తరబడి నిరీక్షణ
- ఆధార్ లింక్ కాకపోవడంతో అవస్థలు

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ టెక్కలి/ ఆమదాలవలస/ నరసన్నపేట/ పోలాకి/ పలాస/ బూర్జ/ జలుమూరు/ హిరమండలం/ కంచిలి/ ఇచ్ఛాపురం/ మెళియాపుట్టి)

పింఛన్ల పంపిణీ తీరుపై లబ్ధిదారులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతనెల మాదిరి ఇవ్వకుండా బ్యాంకులో జమ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తమపై కక్షగట్టి ఇలా చేస్తోందని మండిపడ్డారు. సామాజిక పింఛన్‌దారులకు ఈ నెల కూడా అవస్థలు ఎదురయ్యాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టారు. గత నెల సచివాలయాల్లో సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ నెల సచివాలయ సిబ్బంది ద్వారా కాకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో పింఛన్ జమ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో మొత్తం 3,20,913 మంది పింఛన్‌దారులు ఉండగా.. 3,13,714 మంది లబ్ధిదారులకు డబ్బులు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. 2,39,017 మందికి బ్యాంకు ఖాతాలో జమచేశామని, 74,697 మందికి ఇంటివద్దకే పింఛన్లు పంపిణీ చేశామని తెలిపారు. కాగా కొంతమంది ఆధార్ నెంబర్లు బ్యాంక్ ఖాతాకు అనుసంధానం కాకపోవడం, ఈకేవైసీ చేయకపోవడం, బ్యాంకు ఖాతా వినియోగంలోకి లేకపోవడంతో తమకు పింఛన్ డబ్బులు పడ్డాయో లేవోనన్న టెన్షన్ నెలకొంది. జిల్లాలోని అన్ని బ్యాంకుల వద్ద గురువారం పింఛన్‌దారుల రద్దీ కనిపించింది. వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి బ్యాంకుల వద్ద నిరీక్షించారు. కొంతమందికి పింఛన్ నగదు జమకాకపోవడంతో సిబ్బందిని ప్రశ్నించారు. బ్యాంకు ఖాతాతో ఆధార్ నెంబర్ సీడింగ్ చేయించుకోవాలని వారు చెప్పడంతో.. నిరాశతో వెనుదిరిగారు. మరి కొన్ని బ్యాంకుల్లో లబ్ధిదారులకు.. పాన్‌కార్డు, ఆధార్ జెరాక్స్ తేవాలంటూ నిబంధన విధించారు. మళ్లీ వాళ్లు ఇంటికెళ్లి.. వాటిని తీసుకు వచ్చేందుకు అవస్థలు పడ్డారు. ఎండ తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇబ్బందులకు గురిచేయడం సరికాదంటూ మండిపడుతున్నారు. వాస్తవంగా దివ్యాంగులకు, ఇళ్లు కదల్లేనివారికీ ఇంటివద్దనే పింఛన్ పంపిణీ చేస్తామని అధికారులు వెల్లడించారు. అయితే ఇంటివద్ద పింఛన్ అందుకుందామనుకునే వారికి సచివాలయ సిబ్బంది నుంచి కూడా సరైన సమాచారం లేదు. దీంతో వారు తమకు ఈ నెల పింఛన్ అందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.



ఈమె పేరు **పొట్నూరు దాలమ్మ** హిరమండలం పంచాయతీ గాంధీనగర్ వీధికి చెందిన ఈమెకు ఈ నెల పింఛన్ డబ్బులు అందలేదు. పదేళ్లుగా ఎలాంటి లావాదేవీలు జరగకపోవడంతో ఆమె ఎస్‌బీహెచ్ బ్యాంకు ఖాతా నిలిచిపోయింది. దీంతో ఈ నెల పింఛన్ తనకు అందుతుందో.. లేదోనని టెన్షన్ పడుతోంది. సచివాలయ ఉద్యోగులు కూడా తనకు పింఛన్ అందజేయలేదని ఆవేదన చెందుతోంది.



ఈమె పేరు **బెజ్జిపురపు సరోజనమ్మ** బూర్జ మండలం డొంకలపర్తి గ్రామం. వయసు 85 ఏళ్లు. ఈమెకు వృద్ధాప్య పింఛన్ నగదును బ్యాంకు ఖాతాలో జమ చేశారు. కానీ, ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్న.. తాను బ్యాంకుకు వెళ్లి డబ్బులు ఎలా తెచ్చుకోగలనని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

- టెక్కలి మండలం నర్సింగపల్లి సచివాలయం పరిధి కొల్లివలసకు చెందిన సోనాపురం దాసు, వజ్జీల లక్ష్మీనారాయణ అనే వృద్ధులకు పింఛన్ సొమ్ము నేరుగా చేతికి అందలేదు. బ్యాంకు ఖాతాలో జమకాలేదు. నర్సింగపల్లి సచివాలయం పరిధిలో 40 మందికి, లింగాలవలస సచివాలయం పరిధిలో 21 మందికి పింఛన్‌సొమ్ము అందలేదు. కంచిలి మండలంలో 119 మంది పింఛన్‌దారులకు డబ్బులు జమకాలేదు.
- ఆమదాలవలస, నరసన్నపేటల్లోని స్టేట్‌బ్యాంక్, యూనియన్, కెనరా, గ్రామీణ బ్యాంకులతో పాటు ఎస్‌బీఐ సేవాకేంద్రాల వద్ద పింఛన్‌దారులు బారులుదీరారు. పోలాకి మండలానికి చెందిన కొంతమందికి నరసన్నపేట ప్రధాన బ్యాంక్‌లో డబ్బులు జమ చేసి.. ఖాతాను పునరుద్ధరించుకోవాలని సిబ్బంది చెప్పడంతో వారంతా లబోదిబోమన్నారు.
- మెళియాపుట్టి మండలంలో కేరాసింగిగూడ, రింపి, ఆంపురం, భరణికోట, బాణాపురం, చందనగిరి గ్రామాల గిరిజనులు.. గురువారం చాపర, గొప్పిలి, జాడుపల్లి బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. క్యాష్ పాయింట్ల వద్ద గంటల తరబడి నిరీక్షించారు.

మండుటెండలో వచ్చాం



పింఛన్ సొమ్ము కోసం మండుటెండలో బ్యాంక్‌కు రావాల్సి వచ్చింది. ఈ వయసులో ఎండలో తిరగడమంటే కష్టంగా ఉంది. మాలాంటి వృద్ధులకు ఇంటికి పింఛన్ డబ్బులిస్తే బాగుండేది.

- ముద్దాడ అమ్మన్న, జమ్ము కాలనీ, నరసన్నపేట

రెండు సార్లు తిరిగాను



పింఛన్ కోసం రెండుసార్లు క్యాష్ పాయింట్ వద్దకు తిరిగాను. నా ఖాతాలో డబ్బులు జమకాలేదని చెప్పారు. మళ్లీ క్యాష్‌పాయింట్ నుంచి చాపర బ్యాంక్‌కు వెళ్లాను. అప్పుడు డబ్బులు జమయ్యాయి. వృద్ధులను ప్రభుత్వం ఇలా ఏడిపించడం బాధాకరం.

- కె.అప్పన్న, వెంకటాపురం, మెళియాపుట్టి





ఎండలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు

మాడిపోతున్నారు

ఎండలు మండిపోతున్నాయి. జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అప్రమత్తంగా ఉన్నామంటూ వైసీపీ ప్రభుత్వం కూడా చెబుతోంది. కానీ ఉపాధి పనుల ప్రదేశాన్ని చూస్తే వాస్తవ పరిస్థితి తేటతెల్లమవుతోంది. వేతనదారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. వసతి లేకపోవడంతో ఎండ తీవ్రతకు కూలీలు మాడిపోతున్నారు. వడదెబ్బకు గురై చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. దీంతో కొన్నిచోట్ల కూలీలే సొంతంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేసుకుని సేదదీరుతున్నారు. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. టీడీపీ హయాంలో వేసవి అలవెన్స్ ఇస్తుండగా.. వైసీపీ వచ్చాక దాన్ని నిలిపివేసింది.

(సరుబుజ్జిలి)

- ఎండతీవ్రతకు అల్లాడుతున్న వేతనదారులు
- వడదెబ్బకు గురై మృతి చెందుతున్న కూలీలు
- కనీస సౌకర్యాలు కల్పించని వైసీపీ ప్రభుత్వం

ఉపాధి పనులు చేపడుతున్న ప్రదేశాల్లో వేతదారులు ఎండలకు అల్లాడిపోతున్నారు. వసతుల్లేక వడదెబ్బకు గురవుతున్నారు. జిల్లాలో 30 మండలాల్లో ఈ ఏడాది 2,61,832 మంది ఉపాధి వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారు. వలసలు నివారించడానికి కేంద్రం ఉపాధిహామీ పథకం చేపట్టింది. ఏటా వ్యవసాయ పనులులేని సమయంలో స్వగ్రామాల్లోనే ఉపాధి కల్పిస్తోంది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం మార్గదర్శకాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చి అమలు చేస్తున్నాయి. కేంద్రం ఉపాధి హామీ పథకం ద్వారా విడుదల చేస్తున్న నిధులతో రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ పనులు చేయించి మెటీరియల్ గ్రాంట్ కింద శాశ్వత ఆస్తులను సృష్టించాలి. అయితే ఏపీలో మాత్రం ఉపాధిహామీ పథకం పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోకపోవడంతో మెటీరియల్ గ్రాంట్ అనుకున్న మొత్తం రావడంలేదు. దీంతో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు నిధుల కొరత వెంటాడుతోంది.

అందని అదనపు అలవెన్స్..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి పనుల నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపణలొస్తున్నాయి. గత ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు గునపాలు, తట్టలు తదితర సామగ్రి అందజేసేవి. గత ఐదేళ్లలో పరికరాలు ఇవ్వక పోవడంతో తామే కొనుగోలు చేసుకుంటున్నామని వేతనదారులు వాపోతున్నారు. పనులు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడం లేదు. ఈ పథకం నిబంధనల మేరకు నీడ, నీటి సౌకర్యం కల్పించాల్సిఉంది. టీడీపీ హయాంలో టార్పాలిన్లు అందజేసేవారు. ప్రస్తుతం టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో వేతనదారులే సొంతంగా పనిప్రదేశాల్లో చలువ పందిర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల దగ్గర ఉండేచెట్ల నీడలో సేద దీరుతున్నారు. ఇటీవల కొర్లకోటలో గురుగుబిల్లి రాజులమ్మ వడదెబ్బ గురై మృతిచెందిన విషయం విదితమే. అయినా అధికారులు పనులు జరిగే ప్రదేశాల్లో వసతులు కల్పించడంలేదని కూలీలు వాపోతున్నారు. కుటుంబ పోషణకు ఎండలో సైతం పనులు చేయాల్సి వస్తోందని, అయినా ప్రభుత్వం తమ కష్టాలు పట్టించుకోవడం లేదని వేతనదారులు వాపోతున్నారు. గతంలో పనిముట్లు మంజూరు చేయకపోతే తట్టలు, గునపాల కోసం అదనంగా డబ్బులు చెల్లించేవారు. టీడీపీ హయాంలో ఉపాధిపనులు నిర్వహించిన కూలీలకు వేసవి బోనస్ అదనంగా చెల్లించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదనపు అలవెన్స్ నిలిపివేశారని కూలీలు వాపోతున్నారు. ఐదేళ్లుగా శ్రమదోపిడీకి గురవుతున్నామని సరుబుజ్జిలి మండలంలోని 21 పంచాయతీలకు చెందిన 6,136 మంది ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని వేతనాలు..

ఏప్రిల్ ఎనిమిదో తేదీ నుంచి వేతనాలు అందడంలేదని కూలీలు చెబుతున్నారు. దీంతో కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సివస్తోందని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వేతనం రూ.300కు పెంచింది. అయితే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఎండ తీవ్రత వల్ల ఎక్కువ సేపు పనిచేయలేక పోవడంతో కొలతలు తక్కువగా వస్తుండడంతో కూలి గిట్టుబాటు కావడంలేదు. రెండు పూటలు చేసినా రూ.190 కూడా రావడంలేదని కూలీలు వాపోతున్నారు.

టార్పాలిన్లు ఏర్పాటు చేయాలి..



మండలంలో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రతిరోజూ మండుటెండలోనే ఉపాధి పనులు చేయడానికి వెళ్తున్నాం. ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తుంది. గతంలో పనులు చేసినచోట నీడ ఉండేది. ప్రస్తుతం లేదు. ఐదేళ్లుగా ఉపాధి కూలీలకు ప్రభుత్వం అటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు. పని చేసిన చోట వెంటనే టార్పాలిన్లు ఏర్పాటు చేయాలి.

-మీసాల ధనుంజయరావు, ఉపాధి కూలి, తురకపేట, సరుబుజ్జిలి మండలం

గునపాలు, తట్టలు సరఫరా చేయాలి..



ఉపాధి పనులు చేసిన కూలీలకు గత ప్రభుత్వాలు గునపాలు, తట్టలు సరఫరా చేశాయి. అంతేకాకుండా పనిచేసిన రోజుకు గునపాం, తట్టకు ఐదు రూపాయలు చొప్పున అదనంగా ప్రతికూలికి చెల్లించేవారు. ప్రస్తుతం ఆ ఆ డబ్బులు లేకపోయే.

-పిల్లి వెంకటరావు, ఉపాధి కూలి, నందికొండ, సరుబుజ్జిలి మండలం

ఈవీఎం బటన్ నొక్కి.. బీప్ శబ్దం గమనించాలి

- ఓటు దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు పాటించండి

(గార)

ఓటర్లు పోలింగ్ బూత్‌లో ఈవీఎం బటన్ నొక్కి.. శబ్దాన్ని గమనించాలి. శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగమైనట్లు భావించవచ్చు. ఓటర్లు ఈవీఎం శబ్దంపై దృష్టి కేంద్రీకరించి... అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. రావ డం లేదని కొంద రు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు. పోలింగ్ బూ త్‌లో ముగ్గురు అధికారులు ఉం టారు. మొదటి అధికారి మన వివరాలను పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు. రెండో అధికారి ఓటరు సంతకం తీసుకుంటారు. మూడో అధికారి ఓటరు చేతి వేలికి ఇంకు మార్కు వేస్తారు. ఈ అధికారి వద్దే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అది నొక్కినప్పుడే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. అప్పుడు ఓటరు పరదా చాటునున్న ఈవీఎంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. బటన్ నొక్కినప్పుడు ఒక శబ్దం వస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వీవీప్యాట్‌లో ఓటు వేసిన అభ్య ర్థి పేరు, పార్టీ వివరాలు కనిపిస్తాయి.. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. మూడో అధికారి ఈవీఎం మానిటర్ కంట్రోల్ యూనిట్ యాక్టివేట్ చేయలేదని అర్థం చేసుకోవాలి. వెంటనే ప్రశ్నించాలి. ఇది కూడా రిగ్గింగ్‌లో ఒక భాగమే. వృద్ధులు, కొత్త ఓటర్లు ఇది గమనించకుండా పోలింగ్ బూత్ నుంచి వెళ్లిపోతారు.



తరువాత బూత్‌లో ఉన్నవారు మన ఓటును దుర్వినియోగం చేస్తారు. వాళ్లకు నచ్చిన వారికి వేసుకుంటారు. ఓటు వేయడం మన హక్కు. దానిని జాగ్రత్తగా నిర్వర్తించాల్సిన బాధ్యత మనపై ఎంతగానో ఉంది. ఏమైనా తేడా గుర్తిస్తే మాక్‌పోల్ స్లిప్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలి.

ఖైదీలకూ ఓటుహక్కు

మీకు తెలుసా?

నరసన్నపేట: రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయులకు ఓటు హక్కు ఉంటుంది. అయితే వివిధ కారణాలతో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటుహక్కు ఉంటుందా... ఉండదా అన్న ప్రశ్న చాలామందికి తలెత్తుంది. అయితే ఖైదీలు కూడా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముంది. వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రివెంటివ్ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ తాము ఓటర్లమని, పోలింగ్‌బూత్, ఓటరు క్రమసంఖ్యతో ఓటువేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి, ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.



ప్రచారానికి వెళ్తే రూ. 500

- ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం
- కూలీలు, కళాకారులకు పెరిగిన గిరాకీ

(నరసన్నపేట/టెక్కలి)

పోలింగ్‌కు మరో పది రోజులే సమయం ఉండడంతో అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పాట్లుపడుతున్నారు. ఊరూరా తిరుగుతూ తమకు ఓటు వేయాలని వేడుకుంటున్నారు. వారి తరఫున ముఖ్యనాయకులు, కార్యకర్తలు సైతం తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకొనేందుకు శ్రమిస్తోన్నారు. అయితే ఎన్నికల ప్రచారానికి కేడర్ సరిపోని పార్టీలు దినసరి కూలీలను సైతం ఉపయోగిస్తున్నాయి. మరికొన్ని పార్టీలు మాత్రం కేడర్ సరిపోయినా తమ బలం నిరూపించుకోవడానికి కూలీలను తమ వెంట తీసుకువెళ్తున్నారు. పనులకు వెళ్లడం కన్నా అభ్యర్థుల వెంట ప్రచారానికి వెళ్లడమే బెటర్ అని కూలీలు కూడా భావిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా కూలీలకు గిరాకీ పెరిగింది.



కడుపు నిండా భోజనం..

రోజువారీ కూలీలకు పొద్దంతా కష్టపడితే వచ్చే వేతనం కన్నా ప్రచారానికి వెళ్తే వచ్చే డబ్బులే ఎక్కువగా ఉంటున్నాయి. ఉదయం పది గంటల వరకు ప్రచారంలో పాల్గొనే కూలీలకు టిఫిన్‌తో పాటు రూ.500 వరకు అభ్యర్థులు ముట్టజెబుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ప్రచారానికి వస్తే రాత్రి భోజనంతోపాటు మందు బుడ్డి, రూ.500 కూడా అభ్యర్థులు ఇస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో అభ్యర్థులు ప్రచారానికి వెళ్లే సమయంలో తమ వెంట జనం కనిపించేందుకు ముందుగానే కూలీలను బుక్ చేసుకుంటు న్నారు. అలాగే, పొద్దంతా కష్టపడి అలసిపోయిన నాయకులు, కార్యకర్తలకు అభ్యర్థులు సాయంత్రం వేళ బీరు, బిర్యానీలు సమకూరుస్తున్నట్లు తెలిసింది. అనుచరులు చేజారిపోకుండా ఇవన్నీ ప్రిపేర్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో మద్యం షాపులు, హోటళ్లకు డిమాండ్ పెరిగింది. క్యాటరింగ్ చేసే వారికి కూడా చేతినిండా పనిదొరికింది.

ప్రచార సామగ్రి తయారీదారులకు..

ఎన్నికల్లో గెలవాలంటే.. ముందుగా ప్రచారం హోరెత్తాలి. అలా జరగాలంటే అందుకు అవసరమైన వస్తు, వాహనాలను సమకూర్చుకోవాలి. ప్రత్యర్థిపై పైచేయి సాధించాలంటే అంతకుమించి ప్రచార ఆర్భాటం అవసరం. ప్రచారానికి అవసరమైన సామగ్రిని సంబంధిత వ్యక్తులు... సంస్థల నుంచి కొనుగోలు చేయడం... అద్దెకు తీసుకోవడం పరిపాటి. వివిధ రకాల వస్తువులు... వాహనాలు... మైక్‌సెట్లు... డోర్ స్టిక్కర్లు, వాహనాల స్టిక్కర్లు, జెండాలు, బెలూన్, క్రాకర్స్, కండువాలకు ప్రస్తుతం విపరీతమైన డిమాండ్. తయారీదారులకు... అద్దెకు ఇచ్చేవారికి ఈ ఎన్నికల్లో చేతినిండా పని దొరుకుతోంది. దీంతో ఎంతో కొంత చేతికి అందుతోంది. ఈసారి పోలింగ్‌కు కాస్త సమయం ఎక్కువగా ఉండడం వీరికి కలసి వస్తోంది.

వాయిద్య కళాకారులకు..

రాజకీయ పార్టీలు ఊరూరా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వేళ పలురకాల వాయిద్య కళాకారులకు డిమాండ్ ఏర్పడిది. తీన్‌మార్, ఢంకాలు, మేళం, తప్పెటగుళ్ళ, ధూందాడాకా వంటి వాయిద్యకళాకారుల బృందాలు ఎన్నికల ప్రచారాల్లో ముందువరుసలో ఉంటున్నాయి. ముఖ్యంగా టీడీపీ, వైసీపీ వంటి ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో కొన్నిరకాల వాయిద్య బృందాలను తప్పనిసరి చేయడంతో కళాకారులకు డిమాండ్ నెలకొంది. పూటకో రేటు, రోజుకో రేటు మాట్లాడుకొని వాయిద్య బృందాలను ప్రచార ఆర్భాటాల్లో ముందుంచుతున్నారు. పలురకాల వాయిద్య కళాకారులు శబ్దాలతో హోరెత్తిస్తున్నారు.



టెక్కలిలో టీడీపీ ఎన్నికల ప్రచారంలో వాయిద్య కళాకారులు

నామినేషన్ వేయడమంటే ఆయనకు సరదా

- చిల్లర నాణేలు డిపాజిట్ సొమ్ముగా చెల్లింపు

(జలుమూరు)

జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామానికి చెందిన నాయుడుగారి రాజశేఖర్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందంటే సంబర పడిపోతాడు. ఎన్నికల్లో నామినేషన్ వేయడమంటే ఆయనకు మహా సరదా. డిపాజిట్ చిల్లర నాణేలు చెల్లించడానికి ఇష్టపడతాడు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ తరపున శ్రీకాకుళం లోక్‌సభ బరిలో ఉన్నాడు. తొలుత 2014లో ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరాడు. అనంతరం శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలుచేసినా ఉపసంహరించుకోవల్సి వచ్చింది. 2017లో ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా బరిలో నిలిచాడు. 2019లో సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం ఎంపీ, నరసన్నపేట ఎమ్మెల్యేగా ఇంటిపెండెంట్‌గా పోటీలో నిలిచాడు. 2022లో ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవులకు కూడా నామినేషను వేశాడు. అయితే బలపరిచే ఎంపీలు లేకపోవడంతో నామినేషన్ తిరస్కారానికి గురైంది. 2023లో జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీగా పోటీలో నిలిచాడు. సాధారణ కుటుంబానికి చెందిన తాను వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేయాలన్న దృఢసంకల్పంతోనే ఎన్నికల బరిలో నిలబడుతున్నట్లు రాజశేఖర్ చెబుతున్నాడు. శ్రీముఖలింగం ఖ్యాతి దేశవ్యాప్తంగా తెలియచేసి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి జరగాలనేది తన ఆకాంక్ష అని తెలిపాడు. తాను శ్రీముఖలింగేశ్వరాలయంలో అర్చకుడిని కావడంతో ఏటా మహాశివరాత్రి, కార్తీక మాసంలో అంతరాలయంలో దొరికే సంభావన నాణేలను ఖర్చుపెట్టకుండా వాటిని భద్రపరచి నామినేషన్ సమయంలో డిపాజిట్ సొమ్ముగా చెల్లించినట్లు చెప్పాడు.



నాయుడుగారి రాజశేఖర్

ఆషామాషీ అభ్యర్థులకు అడ్డుకట్ట

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా పది మందిలో గుర్తింపు పొందాలని కొంతమంది కోరుకుంటారు. అసెంబ్లీకి పోటీ చేస్తే సుమారు నాలుగైదు మండలాల్లోనూ... పార్లమెంటుకు పోటీ చేస్తే ఆ పరిధిలోని దాదాపు 30 మండలాల్లోనూ గుర్తింపు తెచ్చుకోవచ్చునని చాలా మంది అనుకుంటారు. ఈ లక్ష్యంతోనే డిపాజిట్ చెల్లించి పోటీకి సిద్ధపడతారు. అటువంటి ఆషా మాషీ పోటీదారులను నిలువరించడం కోసమే కేంద్ర ప్రభుత్వం డిపాజిట్ మొత్తాన్ని లోక్‌సభకు రూ.25 వేలకు, అసెంబ్లీకి రూ.10 వేలకు పెంచింది. డిపాజిట్ మొత్తాల పెంపు నకు సంబంధించిన ప్రజాప్రాతినిధ్య చట్ట (సవరణ) బిల్లు 2009కి పార్లమెంటు ఆమో దం తెలిపింది. దీంతో ఈ సవరించిన మొత్తా లు అమలులోకి వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ మొత్తంలో యాభై శాతం చెల్లిస్తే సరిపోతుంది.



పీపుల్స్ వాయిస్

ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి



నరసన్నపేట: ప్రభుత్వ అసమర్థతతో నిరుద్యోగం పెరిగిపోయింది. రాష్ట్రంలో ఆర్థిక నేరాలు, హత్యలు, దొంగతనాలు పెచ్చుమీరాయి. ప్రభుత్వాలు ఉచితాల పేరుతో ప్రజలను సోమరులుగా మార్చేశాయి. ప్రతి ఇంట్లోనూ చదువుకున్న యువత ఉన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తే వారే కుటుంబాలను పోషించుకోగలరు. భవిష్యత్‌కు భరోసా ఇచ్చే పార్టీను ఎన్నుకోవాలి.

-బలగ ప్రహర్ష, నరసన్నపేట

గోడౌన్ నుంచి స్ట్రాంగ్ రూములకు..

పలాస, మే 2: ఈవీఎంలను గోడౌన్ల నుంచి స్ట్రాంగ్ రూములకు తరలిస్తున్నారు. పోలింగ్‌తేదీ దగ్గర పడుతుండడంతో అధికార యంత్రాంగం ఏర్పాట్లు వేగవంతం చేసింది. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న గోడౌన్ల నుంచి ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు గురువారం తరలించారు. ఈ ప్రక్రియను ఎన్నికల అధికారి, పలాస ఆర్డీవో భరత్‌నాయక్ పర్యవేక్షించారు. వివిధ పార్టీల అభ్యర్థుల సమక్షంలో సాయుధ పోలీసుల మధ్య ఈవీఎంలను భద్రపరిచారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, అభ్యర్థులకు ఈవీఎంలను పరిశీలించడానికి శుక్రవారం వేదిక ఏర్పాటు చేశామని, దీనిపై అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయవచ్చునిన తెలిపారు. అంతకు ముందు పోస్టల్‌బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. ఇతర జిల్లాల్లో ఉద్యోగులు 250 మంది ఉండగా.. పోస్టల్‌బ్యాలెట్లు 3500 ఉన్నట్లు పర్యవేక్షణ అధికారిణి పవిత్ర తెలిపారు.



ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిస్తున్న దృశ్యం



పోస్టల్‌బ్యాలెట్‌లు సిద్ధం చేస్తున్న సిబ్బంది



స్ట్రాంగ్‌రూమ్ వద్ద పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి భరత్‌నాయక్

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శుక్రవారం 3 మే 2024

ఆ రోజుల్లో కక్షలు ఉండేవి కావు



సీనియర్ ఓటరు

నరసన్నపేట: 'నేను తొలిసారిగా 1972లో ఓటు వేశాను. మా రోజుల్లో ఎన్నికల ఎంతో స్నేహపూర్వక వాతావరణంలో జరిగేవి. పోటీచేసే వారి మధ్యకక్షలు ఉండేవి కాదు. ఉదయాన్నే ఓటు వేయడానికి వచ్చిన వారికి పోటీ చేసిన అభ్యర్థులు భోజనాలు ఏర్పాటు చేసేవారు. ఇది లంచం కింద కాదు. రిక్షాలు ఏర్పాటు చేసేవారు. ఏ రిక్షాలో వెళ్లినా మరో పోటీదారు ఫలానా వారు ఆ రిక్షాలో వెళ్లారని అసూయ పడేవారు కాదు. అలా వెళ్లిన వారిపై కక్ష సాధింపునకు దిగేవారు కాదు. ఇప్పుడు అలా కాదు. వీళ్ల మనోళ్లు వారు వాలోళ్లు అని గిరి గీసుకుంటున్నారు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నాడు ఎన్నికల ఫలితాల కోసం బ్యాలెట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి దాదాపు రెండు రోజులు పట్టేది. ఇప్పుడు ఈవీఎంలు రావడంతో ఎవరు గెలిచారో తొందరగా తెలిసిపోతుంది.

-రెడ్డి రామమూర్తి, జమ్ము, నరసన్నపేట మండలం




మోదుగులపుట్టి వద్ద నిలిచిపోయిన రోడ్డు పనులు

జగనన్నా.. ఒడిశా వెళ్లేదెలా..?

● రాళ్లు తేలి గోతులమయమైన పలాస-మెళియాపుట్టి రోడ్డు

పలాస రూరల్: పలాస-మెళియాపుట్టి ఆర్అండ్బీ రోడ్డు అధ్వానంగా మారింది. పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో 'జగనన్నా.. ఒడిశాకు రాకపోకలు ఎలా సాగించాల'ని వాహన చోదకులు ప్రశ్నిస్తున్నారు. పలాస-మెళియాపుట్టి ఆర్అండ్బీ రోడ్డు నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఒడిశాలోని పలు ప్రాంతాలకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాలి. వాస్తవానికి ఒడిశాకు ఆనుకుని పలాస, మెళియాపుట్టి, మందస, నందిగాం, పాతపట్నం తదితర మండలాల్లోని వందలాది గ్రామాలు ఉన్నాయి. వీరికి ఒడిశాలోని పర్లాకిమిడి, బుషికిడి తదితర ప్రాంతాల్లో బంధుత్వాలు ఉండడంతోపాటు వ్యాపార కార్యకలాపాలు జరుగుతుంటాయి. దీంతో పలాస- మెళియాపుట్టి అత్యంత కీలక రహదారిగా ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రహదారి గురించి అస్సలు పట్టించుకోలేదు. దీంతో ఎక్కడ చూసినా గోతులమయమై వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ప్రజలు, ప్రతిపక్షాల నాయకులు ఎన్నో ఉద్యమాలు చేస్తే ప్రభుత్వం ఎన్నికల ముందు ఇటీవల తారురోడ్డు పనులు మొదలు పెట్టింది. అయితే కొన్నిచోట్ల పూర్తి చేయకుండా నిలిపివేసింది. మొదుగులుపుట్టి, రేగులపాడు, టెక్కలిపట్నం వద్ద మధ్యలో రోడ్డు వేయకపోవడంతో రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. దీంతో గమ్యస్థానాలు చేరడానికి అధిక సమయం తీసుకుంటోంది. కల్వర్టులు, ప్రధాన జంక్షన్ల వద్ద రోడ్డును వేయకుండా నిలిపివేయడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



టెక్కలిపట్నం వద్ద రోడ్డు దుస్థితి

సీదిరి సార్.. ఐదేళ్లు సరిపోలేదా?

● పూర్తికాని మందస రోడ్డు విస్తరణ పనులు ● అరకొరగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు
● వాటికి దీపాలు అమర్చని వైనం ● కాలువలూ నిర్మించలేదు ● ప్రజలకు తప్పని ఇబ్బందులు

(మందస)

మందస మేజరు పంచాయతీలో రోడ్డు విస్తరణ పనులు ఐదేళ్లు గడిచినా పూర్తి కాలేదు. రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం, సెంటర్ విద్యుత్ దీపాల ఏర్పాటు, తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరు నెలలుగా ఈ పనులు ఆగిపోయాయి. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మందస రోడ్డు విస్తరణకు అడుగులు పడ్డాయి. పనులకు రూ.4కోట్లు మంజూరయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ, అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ అదే రోడ్డుకు ఎమ్మెల్యే స్థాయిలో సీదిరి అప్పలరాజు శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జూనియర్ కళాశాల వరకూ అన్ని హంగులతో రోడ్డు నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే ఐదేళ్లవుతున్నా పనులు మాత్రం పూర్తి కాలేదు. రోడ్డును నిర్మించినా మిగతా పనులను విడిచి పెట్టారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నా ఆధునికీకరించలేదు. డివైడర్లు ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలు వేసినా వాటికి దీపాలు అమర్చలేదు. అలాగే, డివైడర్లకు గ్రిల్స్ ఏర్పాటు చేసి అందులో మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దుతామని చేసిన ప్రకటన సైతం కార్యరూపం దాల్చ లేదు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా కొందరు ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో దుకాణాలకు వచ్చేవారు వాహనాల పార్కింగ్‌కు అవస్థలు పడుతున్నారు.



డివైడర్లు నిర్మించినా మొక్కలు వేయకుండా వదిలివేసిన దృశ్యం

అభివృద్ధి లేదు



పేరుకు మేజరు పంచాయతీ. కానీ, ఎక్కడా అభివృద్ధి కానరావడం లేదు. పూర్తిస్థాయిలో తాగునీరందడం లేదు. జూనియర్ కళాశాల కూడలి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకూ డివైడర్లు ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలు వేసినా లైట్లు వేయ లేదు.

-రాజాన మహేష్, టీడీపీ నాయకుడు, మందస

పనులు పూర్తికాలేదు



2019 శాసనసభ ఎన్నికల ముందు రూ.4కోట్లు టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసింది. అదే సంవత్సరం ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. అనంతరం గెలుపొందిన ఎమ్మెల్యే సీదిరి అప్పలరాజు మళ్లీ శంకుస్థాపన చేసి పనులు మొదలు పెట్టినా పూర్తి చేయలేకపోయారు.

-డొంకూరు తిరుపతి, మాజీ సర్పంచ్, మందస



విద్యుత్ స్తంభాలకు దీపాలను అమర్చని దృశ్యం

ఆయన సైకిల్ సత్యనారాయణ

● ఎమ్మెల్యేగా 12 ఏళ్లు నిస్వార్థ సేవలు



చౌదరి సత్యనారాయణ

రణస్థలం, మే 2: ఇప్పటి ఎమ్మెల్యేలు ఏసీ కార్లు దిగేందుకే ఇష్టపడరు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో అప్పటి ఎమ్మెల్యేలు ఆదర్శంగా ఉండేందుకు, సాధారణ జీవితానికే ఆసక్తిచూపేవారు. నాటి శాసనసభ్యులతో నేటితరాన్ని బేరీజు వేసి చూస్తే ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. ఇందుకు చక్కని ఉదాహరణ చౌదరి సత్యనారాయణ. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన ఈయన విద్యార్థి దశలోనే ఉద్యమబాట పట్టారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం షేర్‌మహమ్మద్‌పురంలో 1908 జూలై 13న చౌదరి పురుషోత్తనాయుడు, నారాయణమ్మ దంపతులకు సత్యనారాయణ జన్మించారు. స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొని పలుసార్లు అరెస్ట్ కూడా అయ్యారు. 1935లో బుడుమూరు రెవెన్యూ అధికారిగా సత్యనారాయణ పనిచేశారు. కిసాన్, సత్యాగ్రహం, క్విట్ ఇండియా తదితర ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా చౌదరి సత్యనారాయణ

స్వాతంత్ర్యం అనంతరం షేర్‌మహమ్మద్‌పురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1955లో కృషికార్ పార్టీ తరఫున ఆయన శాసనసభకు ఎన్నికయ్యారు. 1962లో స్వతంత్ర పార్టీలో చేరిన ఈయన 1967లో విశాఖ ఉక్కు ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 1967లో పొందూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 12 సంవత్సరాల పాటు శాసనసభ్యునిగా వ్యవహరించిన సత్యనారాయణ.. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే అత్యున్నత పురస్కారం తామర పత్రం అందుకున్నారు.

నిరాడంబర జీవితం

భూస్వామ్య కుటుంబంలో జన్మించి ఎమ్మెల్యేగా రెండుసార్లు ఎన్నికైన చౌదరి సత్యనారాయణ నిరాడంబరంగా జీవితాన్ని గడిపారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎవరికి తనతో పని ఉన్నా, వారిని తన సైకిల్‌పైనే ఎక్కించుకుని సంబంధిత కార్యాలయానికి తీసుకువెళ్లేవారిని ఇప్పటికీ ఈ ప్రాంతంలో గొప్పగా చెప్పుకుంటారు. అందుకే ఆయనపేరు సైకిల్ సత్యనారాయణగా వచ్చిందంటారు. ఈయన 1981లో చనిపోయారు.



సైకిల్‌తో సత్యనారాయణ

18,92,382



● ఇదీ జిల్లా ఓటర్ల సంఖ్య
● జాబితా విడుదల చేసిన ముఖ్య ఎన్నికల అధికారి

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల వేళ జిల్లా ఓటర్లు, ఇతర వివరాలను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం సాయంత్రం వెల్లడించారు. జిల్లాలో కొత్తగా చేర్పులు.. మార్పులతో కలిపి.. 18,92,382 మంది ఓటర్లు ఉన్నట్లు నిర్ధారించారు. జిల్లాలో 2,358 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సర్వీస్ ఓటర్లు 16,448 ఉండగా, మహిళా ఓటర్లు 9,45,945 మంది, పురుష ఓటర్లు 9,29,859 మంది, థర్డ్ జెండర్స్ 130 మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లా ఓటర్ల వివరాలు (ఎన్ఆర్ఐతో కలిపి)

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్స్	సర్వీస్	మొత్తం
ఇచ్ఛాపురం	130751	137434	17	1978	270180
పలాస	107278	112049	21	3030	222378
టెక్కలి	117816	118502	9	2919	239246
పాతపట్నం	112367	112936	10	1854	227167
శ్రీకాకుళం	135301	137928	31	1263	274523
ఆమదాలవలస	96179	97664	15	2240	196098
ఎచ్చెర్ల	123064	121682	14	936	245696
నరసన్నపేట	107103	107750	13	2228	217094
మొత్తం	9,29,859	9,45,945	130	16,448	18,92,382

ప్రచారంలో బంధుగణం

● సకుటుంబ సపరివార సమేతంగా జనంలోకి
● ఇంటింటికీ వెళ్లి ఓట్ల కోసం అభ్యర్థన
● అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి


(నరసన్నపేట)

జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీతో పాటు ఇతర పార్టీల అభ్యర్థుల కుటుంబ సభ్యులు సపరివార సమేతంగా ఎన్నికల ప్రచారాల్లో మునిగి తేలుతున్నారు. నామినేషన్ల ఉప సంహరణ ఘట్టం ముగిసింది. సార్వత్రిక ఎన్నికల రణరంగంలో పోటీపడే అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటించారు. జిల్లాలో ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. 73 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గంలోనూ 13 మంది అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. జాతీయ కాంగ్రెస్, బహుజన సమాజ్‌వాదీ, జాతీయ జనసేన, స్వతంత్ర అభ్యర్థులు ఇలా అనేక మంది బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా అన్ని నియోజకవర్గాల్లోనూ తెలుగుదేశం, వైసీపీల మధ్యే పోటీ ఉంది. ఈ రెండు పార్టీల అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించకముందు నుంచి సుడిగాలి ప్రచారానికి తెరలేపారు. పోలింగ్‌కు మరో 11 రోజులే సమయం ఉంది. ఇందులో ప్రచారానికి తొమ్మిది రోజులే మిగిలింది. ఇంత తక్కువ సమయంలో ఎక్కువ మందిని కలవడం కుదరదు. కుటుంబ సభ్యులంతా ప్రచారం చేయడం వల్ల వృద్ధులు, మహిళలు, యువత ఓట్లను కొల్లగొట్టడానికి ఆస్కారం ఉంటుందని అభ్యర్థులు భావిస్తున్నారు. అందుకే ఇంటిల్లిపాదీ ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతో పాటు అభ్యర్థుల పిల్లలు సాంకేతికంగానూ సహకారం అందిస్తున్నారు. అసంతృప్తులను బుజ్జగించే బాధ్యత తీసుకుంటున్నారు. తద్వారా వారు కూడా ప్రచారంలో భాగస్వాములయ్యేలా జాగ్రత్త పడుతున్నారు.

● నరసన్నపేట కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి గెలుపు కోసం తన భార్య సుగుణ, కుమార్తె అర్చన, కుమారుడు సునీల్, రామ్‌లాల్ గ్రామాల్లో ఇంటింటా తిరుగుతున్నారు. గతంలో రమణమూర్తి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, టీడీపీ సూపర్ సిక్స్ కార్యాక్రమాలను వివరిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఇదే నియోజవర్గంలో వైసీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ తరఫున కోడళ్లు శ్రావణి, గీష్మ ఇంటింటా తిరుగుతూ తన మామయ్యను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

● శ్రీకాకుళం నియోజవర్గం ఉమ్మడిపార్టీ అభ్యర్థి గొండు శంకర్ తరఫున అతని భార్య గొండు స్వాతి గ్రామాల్లో తిరుగుతూ ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు తరఫున కుమారుడు రామ్‌మనోహర్ నాయుడు గ్రామాల్లో పర్యటించి ఓటర్లను కలుస్తున్నారు.

● ఇచ్ఛాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రచారంలో మునిగితేలుతున్నారు. ఈయన భార్య నీలోత్పల సైతం ఓటర్లను కలుస్తొన్నారు. వైసీపీ అభ్యర్థి పిరియా విజయకు తోడుగా భర్త సాయిరాజ్ ప్రచారం చేపడుతున్నారు. ● ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తమ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులతో కలిసి రోజుకో చోట ప్రచారం చేపడుతున్నారు. ఎంపీ భార్య సైతం వేరేగా కేడర్‌తో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇలా జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థుల సతీమణులు, కుమారులు, కుమార్తెలు గ్రామాల్లో ప్రజలు దగ్గరకువెళ్లి ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. బంధుగణం సోషల్ మీడియా ఆయా నియోజవర్గ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వాయిస్ మేసేజ్‌లు పంపిస్తున్నారు. ఓటర్లకు ఫోన్‌లు చేస్తూ ఈసారి ఆయా అభ్యర్థులను గెలిపించాలని నేరుగా కోరుతున్నారు. గ్రామాల్లో ఉన్న అసంతృప్తి నాయకులను బుజ్జగించేందుకు బంధుగణం రంగంలోకి దిగుతుంది. ఇతరపార్టీల వైపు వెళ్లకుండా ఈసారి గెలిచేది మనమేనని.. అధికారంలో వస్తే ఏదో విధంగా సంతప్తి చేస్తామని కొందరికి చెబుతూ మరికొందరికి తాయిలాలు ఇస్తున్నారు. గతంలో జరిగినతప్పులు ఈసారి జరగవని.. పార్టీని వీడవద్దంటూ అభ్యర్థుల బంధువులు అసంతృప్తి నాయకులను బుజ్జిగిస్తున్నారు. కొన్ని నియోజవర్గాల్లో అభ్యర్థులు తనయులు ఉపాధి వేతన దారులు వద్దకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. పట్టణాల్లో దుకాణాలు, లాండ్రీలు, బజ్జీలు వేసేవారు దగ్గర కూడా వెళ్తూతూ ప్రచారం చేపడుతున్నారు. ప్రచారంలోని చిన్నపిల్లలు కనిపిస్తే ఎత్తుకుంటూ వారితో ఫొటోలు తీస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ● శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, పలాస, టెక్కలి, పాతపట్నం, ఇచ్ఛాపురం శాసనసభ నియోజకవర్గాలు శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోకి, ఎచ్చెర్ల నియోజకవర్గం మాత్రం విజయనగరం పార్లమెంటు స్థానం పరిధిలోకి వస్తుంది. ఎచ్చెర్లలో వచ్చే మెజార్టీని బట్టి విజయనగరం పార్లమెంటు అభ్యర్థి గెలుపు... ఓటములు ఆధారపడి ఉంటాయి. దీంతో టీడీపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, వైసీపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ ప్రత్యేకంగా ఈ నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. కుటుంబ సభ్యులను కూడా ప్రచారానికి పంపిస్తున్నారు.



పిల్లలను ఎత్తు.. ఓట్లు పట్టు

(టెక్కలి)

ఎన్నికల ప్రచారంలో ఓటర్ల మనసు గెలుచుకునేందుకు అభ్యర్థులు ఎన్నో చిత్రవిచిత్రాలు చేస్తున్నారు. టీ చేయడం, దోసెలు పోయడం, బజ్జీలు వేయడం, దుస్తులను లాండ్రీ చేయడం వంటివి చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామాల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో చిన్నపిల్లలు కనిపిస్తే వారిని ఎత్తుకునేందుకు పోటీపడుతున్నారు. కొన్నిచోట్ల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఎత్తుకోండి అంటూ అభ్యర్థులకు అందిస్తున్నారు. మొత్తంగా ఎన్నికల ప్రచారాల్లో పిల్లల సందడి కనిపిస్తుంది. గురువారం సంతబొమ్మాళి మండలం గొల్లపేటలో టీడీపీ అభ్యర్థి అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారంలో ఓ పిల్లడ్ని ఎత్తుకుని సందడి చేశారు.



చిన్న పిల్లాడ్ని ఎత్తుకున్న అచ్చెన్నాయుడు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి: ఎంపీ

● ఎమ్మెల్యే అభ్యర్థి ఎంజీఆర్‌తో కలిసి రోడ్‌షో

ఎల్ఎన్‌పేట/కొత్తూరు/హిరమండలం: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. గురువారం పాతపట్నం ఎన్డీఏ అభ్యర్థి మామిడి గోవింద రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ మూర్తితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఎన్‌పేట మండలం బొర్రం పేట గ్రామం నుంచి కొత్తూరు, హిరమండలంలో సాగింది. ఈ సందర్భంగా పలు కూడళ్లలో ప్రచార రథంపై నుంచి ఎంపీ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో భావితరాల భవిష్యత్, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కూటమి నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావును, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి వల్ల నియో జకవర్గంలో ఎవరికీ మనశ్శాంతి లేదన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పాలకొండకు తరలి పోయినా పట్టించుకోలేదన్నారు. జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి కూటమి నాయకులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట రమణ

కూటమితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్: బగ్గు



అంధవరం, మాకివలస యువకులకు పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి

పిన్నింటిపేట(పోలాకి): కూటమితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్ సాధ్యమని నరసన్నపేట కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం పిన్నింటిపేట, బెలమర, పాలవలస, కోడూరు, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు డోల జగన్, తమ్మినేని భూషణరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎంవీ నాయుడు, బీజేపీ నాయకులు కిల్లి లక్ష్మణరావు, కరుకోల రమేష్‌బాబు, జనసేన నాయకులు మెట్ట వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వీడి టీడీపీలోకి అంధవరం యువకులు

జలుమూరు: అంధవరం, మాకివలస గ్రామాలకు చెందిన 20 మంది వైసీపీకి చెందిన యువకులు ఆ పార్టీని వీడి గురువారం టీడీపీలో చేరారు. వీరికి నరసన్నపేట కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. అంధవరం, మాకివలస గ్రామాలకు చెందిన కూర్మాన కృష్ణారావు, శేఖర్, దేవులపల్లి రామకృష్ణ, పల్లి సోమేష్, తిరుమల పవన్, లంక మోహన్ పి.జనార్దనతో పాటు 20 మంది యువకులు చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, నేతలు బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం, దుంగ స్వామిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం అందని ద్రాక్ష: శంకర్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గొండు శంకర్ తదితరులు

అరసవల్లి: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అందని ద్రాక్షగా మారి పోయిందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. గురువారం 24వ డివిజన్ పరిధి మహాలక్ష్మినగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు, ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ● గుజరాతీపేటకు చెందిన న్యాయవాది నాదెళ్ల భాస్కర్ సహా పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే బావాజీపేట వార్డు మెంబరు సహా 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నేతలు సిరిపురం హరి, కవ్వాడి సుశీల, గొర్లె వెంకటరమణ, సీర రమణ, చిట్టి మోహనరావు, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గార:** ఎన్డీఏ కూటమి అభ్యర్థి గొండు శంకర్‌కు మద్దతుగా ఆమె సతీమణి స్వాతి గురువారం బందరువానిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌ను గెలిపించాలని కోరారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా: ఎన్.ఈశ్వరరావు



జి.సిగడాం: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎన్ఈఆర్

జి.సిగడాం: అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తామని ఎన్డీఏ ఎచ్చెర్ల అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. గురువారం విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి చంద్రయ్యపేట, చెట్టుపొదిలాం, మదుపాం, నడిమివలస, ఎందువ, ఎస్‌పీఆర్‌పురం, దేవరవలస, పెనసాం, ఆనందపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమితోనే దేశంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, నక్క మురళి, బూరాడ వెంకటరమణ, కుదిరెళ్ల బుజ్జి, మీసాల మునిలినాయుడు, బోగాది అప్పలనాయుడు, సాకేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెప్పల వలస నుంచి 50 కుటుంబాలు ఎన్డీఏలో చేరిక

రణస్థలం: తెప్పలవలస పంచాయతీ నుంచి మరిశెట్టి నాగేశ్వరరావు, కొయ్యి రామారావు ఆధ్వర్యంలో పాపారావుపేట, మీసాలపేట, సీతారాంపురం గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి గురువారం ఎన్డీఏ కూటమిలో చేరారు. వీరందరికీ ఎన్డీఏ కూటమి బీజేపీ ఎచ్చెర్ల అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు కండువాలు వేసి ఆహ్వానించారు. కూటమిలో చేరిన వారికి అన్నివిధాలా ఆదుకుంటానని, గ్రామాల్లో తాగునీరు, సీసీ రోడ్లు సమస్య పరిష్కరిస్తానని ఎన్ఈఆర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లంక శ్యామలరావు, నాగేశ్వరరావు, ముక్కు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భూ బకాసురుడు జగన్: రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో చేతకాని పాలనతో ప్రభుత్వ ఆస్తులను మింగేసిన భూ బకాసురుడు సీఎం జగన్ అని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో జనం భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆమదాలవలస ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. గురువారం నిమ్మతొర్లాడ, కొరపాం, జీకేవలస, నెల్లిపర్తి, వెదుళ్లవలస, కొత్తవలస, తొగరాం గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోతో వైసీపీ చివరి ఆశలు చచ్చిపోయాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నేతలు పేడాడ సూరపు నాయుడు, సనపల డిల్లీరావు, తమ్మినేని చంద్రశేఖర్, నూక రాజు, భాస్కరరావు, సత్తిరాజు, రమణ మూర్తి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు న్యాయవాదుల మద్దతు

నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్‌కు స్థానిక న్యాయవాదులు మద్దతు పలికారు. గురు వారం బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి ఆధ్వర్యంలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తిలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్, కక్షిదారుల విశ్రాంతి భవనాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు హనుమంతు ప్రసాదరావు, సాధు ధనుంజయరావు, పైడి వరహా నరసింహం, టి.అన్నమ నాయుడు, కె.గణపతిరావు పాల్గొన్నారు. ● **సరుబుజ్జిలి:** వైసీపీలో వివిధ హోదాల్లో ఉన్న వైసీపీ నాయకులు టీడీపీలో గురువారం చేరారు. వీరికి కూన రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బత్తులు బుజ్జి, హేమసుందర రావు తదితరులు పాల్గొన్నారు.



రవికుమార్‌కు మద్దతు తెలుపుతున్న న్యాయవాదులు

బంగారం కోసమే వృద్ధురాలి హత్య

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామంలో గతనెల 26న అనుమానాస్పదంగా మృతి చెందిన దున్న దమయంతి (62) మృతి కేసును పోలీసులు ఛేదించారు. అదే గ్రామానికి చెందిన యానాది జ్యోతి బంగారం కోసమే దమయంతిని హత్యచేసి యానాది నారాయణ సహకారంతో కాలువలో పూడ్చి పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించి కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సీహెచ్ రామారావుతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. అమలపాడు గ్రామానికి చెందిన యానాది జ్యోతి భర్త ఖత్తర్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. జ్యోతి ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటుంది. విలాసాలకు అలవాటుపడిన ఆమె నందిగాంలో ఓ వ్యక్తి నుంచి అల్లుడిని మధ్యవర్తిగా ఉంచి రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకుంది. అప్పు తీర్చుమని సదరు వ్యక్తి నుంచి ఒత్తిడి పెరగడంతో ఏం చేయాలో తోచక ఉన్న సమయంలో దున్న దమయంతి వద్ద ఉన్న బంగారు ఆభరణాలపై కన్నుపడింది. ఆమెతో స్నేహం పెంచుకుంది. ఈ క్రమంలోనే గతనెల 24న దమయంతిని ఇంటికి పిలిచి దోశ ఇచ్చింది. దోశ తింటున్న సమయంలో వెనుక నుంచి దుప్పటి కప్పి మెడపై కాలువేసి గట్టిగా నొక్కడంతో ఆమె అక్కడే మృతి చెందింది. వెంటనే మృతురాలి ఒంటిపై ఉన్న బంగారం గాజులు, రెండుపేటల పుస్తెలతాడు, చెవి దుద్దులు, మూడు ఉంగరాలు, జత ఎత్తు గొలుసులు తీసుకొని మృతదేహాన్ని మంచం కింద ఉంచి దుప్పటి కప్పింది. అదే రోజు రాత్రి పరిచయం ఉన్న యానాది నారాయణను పిలిచి జరిగి విషయం చెప్పింది. ఈ వ్యవహారంలో తన సాయం కావాలంటే మృతురాలి నుంచి దోచుకున్న బంగారంలో వాటా కావాలని నారాయణ డిమాండ్ చేయగా.. అందుకు రెండు తులాలిచ్చేందుకు జ్యోతి అంగీకరించింది. అదే రోజు రాత్రి ఒంటి గంట సమయంలో జ్యోతి ఇంటి సమీపంలో ఉన్న కాలువలో మృత దేహాన్ని ఇద్దరూ కలిసి తోసేశారు. తల్లి కనిపించకపోవడంతో ఆమె కుమారుడు కృష్ణారావు సామాజిక మాధ్యమంలో మెసేజ్ పెట్టారు. గ్రామంలోనూ, పలాస రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. నిందితురాలు జ్యోతిని కూడా ఇదే విషయం అడిగినా ఆమె తెలియదని సమాధానమిచ్చింది. సంఘటన జరిగిన రెండు రోజుల తరువాత గతనెల 26న కాలువ నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి గ్రామస్థులు కాలువ పైకప్పు తీసి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన పై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో దమయంతి మెడ ఎముక విరిగి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గ్రామానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టగా జ్యోతి, నారాయణపై అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే ఆ సమయంలో దమయంతి గ్రామంలో ఉండ కుండా శ్రీకాకుళం, కాశీబుగ్గ బంగారు దుకాణాలలో దమయంతి నుంచి దొంగలించిన బంగారం అమ్మకాలకు రకరకాల ప్రయత్నాలు చేసింది. గ్రామంలో పోలీసులు విచారణ, గ్రామపెద్దలు అనుమానాలు వ్యక్తం చేయడం లాంటి సంఘటన లపై మరో నిందితుడు నారాయణ ఎప్పటికప్పుడు జ్యోతికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. చివరకు ఈ కేసు నుంచి తప్పించుకోలేమని గుర్తించి ఈనెల ఒకటిన వీఆర్వో సహకారంతో పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సీఐ తెలిపారు. నిందితులు జ్యోతి, నారాయణ నుంచి సుమారు 86 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై ఐపీసీ 379, 302, 3201, 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి గురువారం పలాస కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

దాడి ఘటనపై డీఎస్పీ విచారణ

పొందూరు: మండల కేంద్రం రాపాక కూడలి సమీపంలో మద్యం దుకాణం వద్ద గత నెల 15న గేదెల రాము అనే యువకుడిపై జరిగిన దాడి ఘటనపై శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ విభాగం డీఎస్పీ పి.విజయ్‌కుమార్ గురువారం విచారణ చేశారు. దాడి సమయంలో ముగ్గురు వ్యక్తులు కత్తితో రాముపై దాడిచేసి గాయపరిచారు. దీనిపై బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేయగా డీఎస్పీ విచారించారు.

నీలగిరి తోట ఆహుతి

బూర్జ: లచ్చయ్యపేట సమీపంలో నీలగిరి తోటకు గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆహుతైందని స్థానికులు తెలిపారు. మంటలు చెలరేగిన విషయం తెలుసుకుని స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కొంచాడ స్వామినాయుడు, గిరడ అప్పల నాయుడు, కింతలి కిరణ్‌కుమార్, రాయపురెడ్డి సింహాద్రి కి చెందిన నీలగిరి తోట దగ్ధమవడంతో వారు లబోదిబోమంటున్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేశాడు: అచ్చెన్నాయుడు



సంతబొమ్మాళి: ఒక్క అవకాశం ఇవ్వాలని మభ్యపెట్టి సీఎం జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశాడని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం రుంకు హనుమంతుపురం, కొత్తూరు జగన్నాథపురం, ఒమ్మిలాడ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తాము అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న టంకాల రామారావు, చంటి తదితరులు పాల్గొన్నారు. ● **టెక్కలి:** టెక్కలి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. గురువారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరిన వారికి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. భావనపాడు, దీనబంధుపురం, వెంకటాపురం, మర్రిపాడు, పాలనాయుడుపేట, హనుమంతుపురం, రుంకు హనుమంతుపురం, కోటబొమ్మాళి మేజర్ పంచా యతీ విద్యుత్‌నగర్, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి 300కు పైగా కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.

సంక్షేమరాజ్యం కోసం టీడీపీ రావాలి: అశోక్



సోంపేట: రాష్ట్రంలో అసమర్థ పాలన పోయి సంక్షేమ రాజ్యం రావాలంటే సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. సుంకిడి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. సీఎం జగన్ ప్రజలకు పావలా ఇచ్చి రూపాయి దోచుకున్నాడని విమర్శించారు. చంద్ర బాబు సీఎం అయిన తరువాత మహిళలకు అన్నిరకాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయ కులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శేఖర్, మద్దిల నాగేశ్వరరావు, బెందాళం బాబూరావు, మద్దు రవి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యల పరిష్కారమే ధ్యేయం: శిరీష

పలాసరూరల్: సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కూటమి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. పలాస మండలం కాంట్రగడ, అల్లుకోల, మహాదేవపురం, సుబ్బుగుడ్డి, కైజోల, కొత్తూరు, తర్లాకోట గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, పోలాకి పాపారావు, కద్దాల నాగేశ్వరరావు, కృష్ణారావు, దువ్వాడ సంతోష్, హోరియా మోహనరావు, కృష్ణారావు పాల్గొన్నారు. లొత్తూరు గ్రామంలో పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. **హరిపురం:** మందస మండలం హొన్నాళి, రాంపురం పంచాయతీలకు చెందిన పలు వురు వైసీపీ నేతలు, కార్య కర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలో గురువారం చేరారు.



మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష

24 కిలోల గంజాయితో ఒకని అరెస్టు

పలాస: ఒడిశా రాష్ట్రం ఆర్.చంద్రగిరి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 24 కిలోల గంజాయిని కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పట్టుకున్నారు. ముంబైకి చెందిన సురేష్ అభిషేక్ గంజాయి కొనుగోలు చేసి ఆర్ చంద్రగిరికి చెందిన రాజు అనే వ్యక్తి సహకా రంతో పలాస రైల్వే స్టేషన్‌కు ఆయన వాహనంపైనే బుధవారం రాత్రి వచ్చారు. గస్తీలో ఉన్న పోలీసు లను చూసి రాజు పరారీ కాగా పలాస రైల్వే స్టేషన్ రోడ్డులో అభిషేక్ పోలీసులకు చిక్కాడు. అయన బ్యాగ్ తనిఖీ చేయగా 23 కిలోల గంజాయి లభ్యమైంది. ఆయన్ను అరెస్టు చేసి గురువారం పలాస కోర్టులో హాజరుపరిచి పాతపట్నం జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వరకట్నం వేధింపుల కేసు నమోదు

కంచిలి: కంచిలి మండలం పెద్ద కొజ్జిరియాకి చెందిన మార్పు సింధు వరకట్నం వేధింపులు తాళలేక బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని కంచిలి పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సింధుకి రెండేళ్ల కిందట పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన జగదీష్‌తో వివాహమైంది. వీరికి 14 నెలల బాబు ఉన్నాడు. అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తమామలు తరచూ వేధింపులకు గురిచేస్తున్నారని, ఇవి తాళలేకే ఉరి వేసుకొని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

వైసీపీ హయాంలో చేనేత కార్మికులకు దగా

పాతపట్నం: సీఎం జగన్ ఇస్తున్న నేతన్న నేస్తం ఒట్టి బూటకమని, వైసీపీ హయాంలో చేనేత కార్మికులు దగాకు గురయ్యారని ఆప్కో మాజీ డైరెక్టర్ కాశిన ప్రసాదరావు అన్నారు. కాగువాడ గ్రామంలో గురువారం నియోజకవర్గ స్థాయి చేనేత కార్మికుల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేవలం 80 వేల మందికి మాత్రమే ఏడాదికి రూ.24 వేలు చొప్పున ఇచ్చారన్నారు. కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. శాలివాహన సహకార స్పిన్నింగ్ మిల్ చైర్మన్ మంచు కృష్ణారావు, మాజీ సర్పంచ్‌లు కూశెట్టి కాంతారావు, వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'కు భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు

టెక్కలి: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు బెస్ట్ ఎకడమిక్ భారత్ ఎడ్యుకేషన్ ఎక్స లెన్స్ అవార్డు బ్రైన్ విజన్ సంస్థ అందజేసిందని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలి పారు. విశాఖలో ఏపీసీటీఈ ప్రతినిధి డాక్టర్ చంద్రశేఖర్, ఏయూ వీసీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి ఈ అవార్డును అందించారన్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడంలో భాగంగా వారం రోజుల పాటు ఏపీసీటీఈ, బ్రైన్ విజన్ సంస్థ అంతర్జాతీయంగా ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించిందన్నారు. ఈ వర్క్ షాప్‌లో అత్యధికంగా పేర్లు నమోదు చేసుకున్న ఐదు కళాశాలలను ఎంపిక చేయగా వాటిలో ఆదిత్య ఒకటన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించిన అధ్యాపకులను అభినందించారు.

అవయవదానంతో చిరంజీవి



శ్రీనివాసరావు (ఫైల్)

పొందూరు: తాను మరణించినా అవయవదానంతో చిరంజీవిగా నిలిచారు వెంకు మహంతి శ్రీనివాసరావు (54). మరో ఐదుగురికి ప్రాణం పోశారు. పొందూరు గాంధీ నగర్‌కు చెందిన శ్రీనివాసరావు విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్నారు. గత నెల అధిక రక్తపోటు కారణంగా రక్తం గడ్డకట్టి కోమాలోకి వెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అతడిని విశాఖలోని విమ్స్ ఆసు పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందారు. ఇంతటి బాధలోనూ శ్రీనివాసరావు భార్య సునీత, కుమారుడు, సోదరుడు ప్రకాశరావు సంపూర్ణ అవయవ దానానికి అంగీక రించడంతో కళ్లు, కిడ్నీలు, కాలేయం, గుండె తదితర అవయవాలను అవసరమున్న ఐదుగురు రోగుల కోసం వివిధ ఆసుపత్రులకు తరలించారు. దీనికి అధికారులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు.

ఆదిత్యుని ఆదాయం రూ.31.85 లక్షలు

అరసవల్లి: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీలను గురు వారం లెక్కించారు. దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ, అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. 36 రోజులకు గాను రూ.31,85,917 వచ్చినట్లు ఈవో తెలిపారు. వీటిలో నోట్ల రూపేణా రూ.30,74,034, చిల్లర రూ.1,11, 883 లభించాయి. 24 గ్రాముల బంగారం, 1 కేజీ 470 గ్రాముల వెండితో పాటు ఇతర దేశాల డాలర్లు, రియాల్స్ వచ్చినట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

ఆదిత్యుని దర్శించుకున్న ఎస్ఎస్ఏ పీడీ

ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సమగ్ర శిక్షా పీడీ బి.శ్రీనివాసరావు (ఐఏఎస్) గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి జ్ఞాపికను ఈవో ఎస్.చంద్రశేఖర్ అందజేశారు.